క్లుప్తంగా

మర్రిపాలెం రైతుబజార్‌లో సబ్సిడీపై వంటనూనె



సబ్సిడీ వంటనూనె ప్యాకెట్లు అందిస్తున్న భాస్కరరావు

విశాఖ విద్య: మర్రిపాలెం రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన సబ్సిడీ వంట నూనె విక్రయ కౌంటర్‌ను జిల్లా పౌరసరఫరాల అధికారి భాస్కరరావు శుక్రవారం తనిఖీ చేశారు. సబ్సిడీపై వంటనూనెలు విక్రయిస్తున్న కౌంటర్‌ను పరిశీలించారు. బయట మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరుగుతున్నందున, వినియోగదారులకు సబ్సిడీపై వంట నూనె అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొమ్మునాపల్లి వరహాలు, సహాయకుడు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

40 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి గంజాయి రవాణా చేస్తున్న నలుగురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.2 లక్షలు విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలివీ.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలలో తనిఖీలు చేపట్టారు. ఒడిశాకు చెందిన నలుగురి బ్యాగుల్లో 40 కిలోల గంజాయిని గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని.. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ ఎం.ఎల్.మీనా తనిఖీల్లో పాల్గొన్నారు.

ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా జెట్సీ



జెట్సీ మిరలిన విలియమ్స్

బీచ్‌రోడ్డు: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లండన్‌లో వందేళ్లుగా నిర్వహిస్తున్న ఇండియన్ స్టూడెంట్ హాస్టల్స్ ట్రస్ట్ సభ్యురాలిగా నగరానికి చెందిన జెట్సీ మిరలిన విలియమ్స్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ముంబయిలో జరిగిన జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆమెను ట్రస్ట్ సభ్యురాలిగా ఎన్నుకున్నారు. ప్రస్తుతం ఆమె నేషనల్ కౌన్సిల్ ఆఫ్ వైఎంసీఏ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆమెను విశాఖపట్నం వైఎంసీఏ అధ్యక్షుడు కృపాదన్ కుమార్, సభ్యులు అభినందించారు.

తిరుమల బ్రహ్మోత్సవాల్లో కోలాటం నృత్య ప్రదర్శన



తిరుమల బ్రహ్మోత్సవంలో కోలాటం ప్రదర్శించిన బృందం

దాబాగార్డెన్స్: గాజువాక శ్రీనగర్, సంపత్ వినాయకనగర్‌కు చెందిన వెంకట సీతారామ మహిళా భక్త మండలి సభ్యులు, సంస్థ ప్రతినిధి కె. సుజాత సారథ్యంలో తిరుమల బ్రహ్మోత్సవాల్లో కోలాటం ప్రదర్శించి భక్తుల మన్ననలు పొందారు. సంస్థ తరఫున సాలికట్ల బ్రహ్మోత్సవంలో పాల్గొని కోలాటం ప్రదర్శించి విశాఖ ఆధ్యాత్మిక వైభవాన్నిచాటి, వేంకటేశ్వరస్వామి ఆశీస్సులందుకున్నారు. ఈ సందర్భంగా మహిళా సభ్యులకు పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

వైభవుడికి సుప్రభాత సేవ నేడు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించి, అభిషేకాలు చేస్తారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.

ఆర్టీసీ గడ్డ.. ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డా

దసరా పండగ వేళ ఆర్టీసీ ఆదాయానికి ప్రైవేట్ ట్రావెల్స్ గండికొడుతున్నాయి. ఎన్ఏడీ సెంటర్‌లో జరిగే ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ వ్యవహారంపై ఆర్టీసీ, రవాణ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో ఆర్టీసీ బస్టాప్ ల్లోనే దర్జాగా గంటల తరబడి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నిలిపి ప్రయాణికుల్ని ఎగరేసుకుపోతున్నారు. షరా'మామూళ్లు'గానే అధికారులు వ్యవహరిస్తున్నారు.

- ఎన్ఏడీ బస్టాప్‌లో నిలుపుతున్న ప్రైవేట్ బస్సులు
- రోజూ వేల మంది ప్రయాణికులు ఇక్కడి నుంచే..
- ద్వారకా బస్టాండ్ తర్వాత ఇదే ప్రధానమైన సెంటర్
- దసరా వేళ ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి



ఎన్ఏడీ ఆర్టీసీ బస్టాప్ వద్ద ప్రయాణికులను ఎక్కించుకుంటున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

విశాఖ విద్య: విశాఖ నగరంలో ద్వారకా బస్టాండ్ తర్వాత ఎన్ఏడీ సెంటరే దూరప్రాంత ప్రయాణికుల రాకపోకలకు ప్రధానమైన సెంటర్. ఇక్కడి నుంచి రోజూ 3 వేల మంది, వీకెండ్‌లో 5 వేల మంది వరకు ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. సింహాచలం ఆలయ దర్శనం కోసం వచ్చే భక్తులతో పాటు, ఎన్ఏడీ సెంటర్‌కు నలువైపులా ఉన్న మర్రిపాలెం, పెందుర్తి, విమానాశ్రయం, ఊర్వశి జంక్షన్ తదితర రూట్లలో వచ్చే వారంతా ఇక్కడే బస్సులు ఎక్కుతారు. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లే బస్సులు ఎన్ఏడీ సెంటర్లో నిలిపేలా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు.

ప్రైవేట్ ట్రావెల్స్ అడ్డాగా ఆర్టీసీ బస్టాప్

ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రధాన బస్టాప్‌లలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను నిలుపరాదు. కానీ ఎన్ఏడీ సెంటర్‌లో మాత్రం ఆర్టీసీ బస్టాప్‌నే అడ్డాగా చేసుకుని ప్రైవేట్ ట్రావెల్స్ వారు ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. రోజూ మధ్యాహ్నం 1 గంట మొదలు రాత్రి 11 గంటల వరకు సుమారు 350 ప్రైవేట్ బస్సులు ఎన్ఏడీ మీదుగా రాజమండ్రి వైపు వెళ్తుంటాయని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ ఎన్ఏడీ సెంటర్‌లో వీటి నియంత్రణపై అధికారులు కనీస చర్యలకూ సాహసించట్లేదు.

చోద్యం చూస్తున్న అధికారులు

బతుకు తెరువు కోసం నడిపే ఆటోలు, స్కూల్ బస్సులపై ప్రతాపం చూపించే రవాణా శాఖ అధికారులు ప్రైవేట్ ట్రావెల్స్ విషయంలో ఎందుకో ఉదాసీనంగా ఉంటున్నారు. రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం ఎన్ఏడీకి కూతవేటు దూరంలోనే ఉంది. ఇక్కడి అధికారులు తరచూ కార్యాలయం ఎదురుగా హైవేపై వాహన తనిఖీలు చేస్తుంటారు. అలాంటి వీరికి, రోజూ విశాఖ నుంచి ఎన్ఏడీ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లే వందలాది ప్రైవేట్ బస్సులు కనిపించట్లేదంటే ఏమనుకోవాలో మరి.

ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం

ద్వారకా బస్టాండ్ తర్వాత ప్రధానమైన బస్టాప్‌గా ఎన్ఏడీ సెంటర్‌ను గుర్తించిన ఆర్టీసీ అధికారులు, ఇక్కడ తగిన ఏర్పాట్లు చేయటంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఇద్దరు గైడ్లను ఇక్కడ విధుల్లో ఉంచారు. టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్ కూడా ఉంది. అయితే బస్టాప్‌లో ప్రైవేటు బస్సుల్ని నిలపకుండా నియంత్రించడంలో విఫలమవుతున్నారు. ఆర్టీసీ, రవాణ శాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని, ఎన్ఏడీ సెంటర్‌లో జరిగే ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజానీకం కోరుతున్నారు.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



ఎన్ఏడీ బస్టాప్ వద్ద రిజర్వేషన్ కౌంటర్

ఉన్నతాధికారులకు నివేదించాం

ఎన్ఏడీ బస్టాప్‌లో ప్రైవేట్ బస్సుల నిలుపుదల వల్ల కొంత ఇబ్బందిగానే ఉంది. మేం హెచ్చరిస్తున్నా కొంతమంది ట్రావెల్స్ వారు లెక్కచేయట్లేదు. పోలీస్ శాఖ నుంచి ఒక కానిస్టేబుల్‌ను కేటాయిస్తే బాగుంటుంది. ఈ విషయాన్ని మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– రమణ, ఆర్టీసీ గైడ్

ముందు జాగ్రత్తలతో క్యాన్సర్ నివారణ



పాపా హోంలో వ్యాక్సిన్లు వేసుకున్న బాలికలతో డాక్టర్ మురళీకృష్ణ తదితరులు

సీతమ్మధార: సీతమ్మధార బాలికల పాపా హోంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి, రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత క్యాన్సర్ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ వైద్య శిబిరం నిర్వహించారు. 9 ఏళ్ల నుంచి 14 ఏళ్ల వయసు లోపు 40 మంది బాలికలకు భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్(సర్వైకల్) వ్యాధిన పడకుండా హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఇంజక్షన్ ద్వారా వేశారు. ఈ సందర్భంగా క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, ముందస్తు జాగ్రత్తలతో నివారించవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకుని తగు జాగ్రత్తలు తీసుకుంటే క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.1.50 లక్షల ఖరీదైన వ్యాక్సిన్లు బాలికలకు ఉచితంగా అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ పోర్ట్ సిటీ అధ్యక్షుడు కె.వెంకటరమణ, పాపా హోం అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, కార్యదర్శి వి.ప్రకాశరావు, కోశాధికారి రమేష్ చంద్‌జైన్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ప్రక్రియ ఆపకుంటే ప్రతిఘటన తప్పదని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో 11 రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద శుక్రవారం సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్‌ను పోర్టు నిధులతోనే 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేయాలన్నారు. పీపీపీ పేరుతో ప్రైవేటీకరణ వద్దని, టెండర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ పోర్టు ఏటా కనీసం రూ.300 కోట్లు లాభాలు ఆర్జిస్తోందని, వివిధ పన్నుల రూపంలో రూ.117 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కడుతోందని తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్‌కు కట్టబెట్టాలనే మోదీ ప్రభుత్వం పోర్టు హాస్పిటల్‌ను కూడా వదలడం లేదని ఆరోపించారు. పోర్టు ఆస్పత్రిపై ఆధారపడిన 40 వేల మంది లబ్ధిదారుల ఆరోగ్యాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టడం దారుణమని, వారి హక్కులను కాలరాయడమేనన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.జగన్, ఆర్కేఎస్‌వీ కుమార్, బి.ఈశ్వరమ్మ, బి.పద్మ, యు.ఎస్.ఎన్.రాజు, జిల్లా నాయకులు పి.పైడిరాజు, అప్పలరాజు, వి.నరేంద్రకుమార్, ఎం.రాంబాబు, బి.రమణి, ఎం.సుబ్బారావు, వెంకటరావు, సత్యనారాయణ, కె.ఎం.కుమార మంగళం, కె.కుమారి తదితరులు పాల్గొన్నారు.

జయ శుభకారిణి.. విజయ రూపిణి

- వైభవంగా మహర్నవమి పూజలు
- పలు చోట్ల దసరా ఉత్సవాలు ప్రారంభం



అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన శుక్రవారం దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీఎంసీ 59వ వార్డు పరిధి గణపతినగర్, హిమాచల్‌నగర్, నెహ్రూనగర్ ప్రాంతాల్లో భారీ అన్నసమారాధనలు జరిపారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు రేవళ్ల సత్యనారాయణ, తంతటి సంపత్, అర్జున్, మడక అప్పారావు, యంద్ర మహేష్, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

- 61వ వార్డులో అల్లరి యూత్ అధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. అమ్మవారిని ప్రతిష్ఠించి, కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు జరిపారు.
- విజయ కనకదుర్గాదేవి ఆలయంలో మహర్నమి పురస్కరించుకుని అమ్మవారు మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. గాజువాక ఆర్టీసీ డిపో ఎస్ఎంయూ కార్యదర్శి పి.శంకరరావు, ప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- 61వ వార్డు పద్మశాలివీధిలో చింతలపూడి శివకుమార్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి, ప్రత్యేక పూజలు జరిపారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్, సంధ్య దంపతులు , చింతలపూడి సత్యనారాయణ దంపతులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

సింథియా: 62వ వార్డు ఎన్టీఆర్‌కాలనీలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. తొలుత అమ్మవారిని దర్శించుకుని, పూజలు చేశారు. స్థానిక నాయకుడు రామకృష్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో క్రాంతి క్రేజీ బాయ్స్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మను పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు కుమారుడు మౌర్యసింహ, వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు గల్లా చిన్నా దర్శించుకుని, ప్రత్యేక పూజలు జరిపారు.



అల్లరి యూత్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి సన్నిధిలో రామ్మోహన్‌నాయుడు



అమ్మవారిని దర్శించుకుంటున్న మౌర్యసింహ, కార్పొరేటర్ గల్లా చిన్నా



విజయ కనకదుర్గ ఆలయంలో అమ్మవారి రథం వద్ద ఎస్ఎంయూ కార్యదర్శి శంకరరావు



90వ వార్డు సాయి మందిరంలో దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



పద్మశాలివీధిలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న మజ్జి సోమేష్, సంధ్య దంపతులు

కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనను ప్రారంభించారు. స్థానిక నాయకులు రాము, జెర్రిపోతుల నర్సింగరావు, పుక్కల కృష్ణ, విష్ణు, గణేష్, తులసి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: దసరా ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 52, 90వ వార్డుల్లోని శాంతినగర్, కరాస, గౌరీనగర్, బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ, లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, గవరవీధి, కాకాని నగర్ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారికి విశేష పూజలు చేస్తున్నారు. 52వ వార్డులోని పలు కాలనీల్లో ఏర్పాటు చేసిన మండపాల్లోని అమ్మవారిని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శుక్రవారం దర్శించుకున్నారు. అన్నసమారాధన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడి

యువకుడిపై యువతి ఫిర్యాదు

అల్లిపురం: ప్రేమ, పెళ్లి పేరుతో ఓ యువకుడు నమ్మించి తనపై అత్యాచారానికి పాల్పడ్డాడని వన్‌టౌన్ పోలీసులకు ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ కేసుకు సంబంధించి సీఐ భాస్కరరావు తెలిపిన వివరాలివీ.. బాధితురాలిది శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల. తన తల్లిదండ్రులతో పండావీధిలో నివాసం ఉంటోంది. ఆమె డిగ్రీ పూర్తి చేసి.. ఇంటి వద్దనే ఉంటోంది. 2020లో తన సోదరుడి స్నేహితుడు గుజ్జు ప్రసాద్‌తో ఇన్‌స్టా గ్రామ్‌లో ఆమెకు పరిచయం ఏర్పడింది. సోదరుడు స్నేహితుడి కావడంతో ఆమె అతని ఫ్రెండ్ రిక్వెస్ట్‌ను ఆమోదించింది. ఈ క్రమంలో ప్రేమిస్తున్నానని పదే పదే ఆమెకు చెప్పేవాడు. కాగా.. యువతి సోదరుడు 2022లో ప్రమాదవశాత్తు మరణించాడు. దీంతో పెళ్లి చేసుకుంటానని ప్రసాద్ ఆమెను ఒత్తిడి చేయడంతో అంగీకరించింది. అప్పటి నుంచి అతను తరచూ ఆమె ఇంటికి వస్తుండేవాడు. తల్లిదండ్రులు లేని సమయంలో ఆమెతో శారీరకంగా కలిసే వాడు. ఇదిలా ఉండగా ప్రసాద్‌కు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం రావడంతో ట్రెనింగ్ నిమిత్తం వేరే ప్రాంతానికి వెళ్లాడు. 2023లో సెలవులకు ఆమె ఇంటికి వచ్చాడు. అదే ఏడాది డిసెంబర్ నుంచి ప్రసాద్ ఆమెతో మాట్లాడటం మానేశాడు. దీనిపై బాధితురాలు పలుమార్లు ప్రసాద్‌ను అడిగినప్పటికీ అతని నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. చివరికి నీతో పెళ్లి ఇష్టం లేదని చెప్పడంతో ఆమె ఈ విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లింది. వారు ప్రసాద్‌ను హెచ్చరించినప్పటికీ అతను ఆమెతో పెళ్లికి నిరాకరించాడు. దీంతో బాధితురాలు శుక్రవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ప్రసాద్‌పై ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ఆటోనగర్‌లో దుర్గాదేవి సన్నిధిలో ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకర్

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ వాసీవాలో నెలకొల్పిన దుర్గమ్మను ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి (రఘు) ఆటోనగర్‌లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆటోనగర్‌లో ప్రధాన రోడ్డు నిర్మాణ పనులకు ఆటంకం లేకుండా త్వరగా పనులు జరిగేలా చూడాలని, ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో నిర్వహించడానికి శాశ్వత స్థలం కేటాయింపు, భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు, అనుమతుల ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శివశంకర్‌ను వాసీవా, ఐలా ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఐలా ఉపాధ్యక్షుడు కొల్లి ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్, కోశాధికారి పర్చూరి ప్రభాకర్, రామభద్రరాజు, ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, కొల్లి సత్యనారాయణ, లఘు ఉద్యోగ భారతి విశాఖపట్నం అధ్యక్షుడు అట్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గురునాథరావు సేవలు చిరస్మరణీయం



గుడివాడ గురునాథరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న సోదరుడు అప్పలరామ్మూర్తి



పేదలకు దుప్పట్లు పంచుతున్న మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన తనయుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురునాథరావు 69వ జయంతిని మిందిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జెడ్పీ హైస్కూల్ పక్కనున్న గురునాథరావు విగ్రహానికి ఆయన తనయుడు అమర్‌నాథ్, ఆయన సోదరుడు, వైఎస్సార్ సీఈసీ సభ్యుడు గుడివాడ అప్పల రామ్మూర్తి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి వెంకట్రామయ్య, తిప్పల గురుమూర్తి రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమర్‌నాథ్ మాట్లాడుతూ గురునాథరావు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్‌కు ఆత్మీయుడని, ఆయనకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికీ ఎందరో అభిమానులున్నారని గుర్తు చేసుకున్నారు. ఉత్తరాంధ్రతో పాటు పెందుర్తి, గాజువాక అభివృద్ధికి ఎంతో కృషి చేసిన నాయకుడన్నారు. అనంతరం పేదలకు, మహిళలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. 68వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, ఇమ్రాన్, సురేష్, నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, పల్లా చినతల్లి, ఉరుకూటి అప్పారావు, మంత్రి శంకరనారాయణ, బొడ్డు గోవింద్, సంగ్రాన నూకరాజు, వరదాడ వెంకటరమణ, నంబారు రాజు, ఈటి సురేష్, రొక్కం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటు



రతన్‌టాటా చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు, కార్మిక నాయకులు

ఉక్కునగరం: మానవతావాది, ఆదర్శనీయుడు రతన్ టాటా మృతి దేశానికి తీరని లోటని స్టీల్‌ప్లాంట్ కోక్ ఓవన్స్ ఉద్యోగులు కొనియాడారు. శుక్రవారం కోక్ ఓవెన్స్ విభాగంలో జరిగిన కార్యక్రమంలో రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రతన్‌టాటా పారిశ్రామకవేత్తగానే కాకుండా గొప్ప సేవలు అందించారన్నారు. విలువలతో కూడిన వ్యాపారం చేస్తూ ఒక పెద్ద బ్రాండ్‌ను సృష్టించారన్నారు. తన జీవితం చివరి వరకు ఎంతో సాధారణ జీవితం గడిపి అందరికీ ఆదర్శనీయులుగా నిలిచారన్నారు. కరోనా సమయంలో తొంబై శాతం దేశ ప్రజల కోసం వెచ్చించిన మహోన్నత వ్యక్తి ఆయన అని కొనియాడారు. కార్యక్రమంలో విభాగం జీఎం కోటేశ్వరరావు, డీజీఎంలు దుర్గాప్రసాద్, భీమ్ శ్రీనివాస్, కార్మిక నాయకులు కొమ్ము ప్రసాదరావు, పి.వి.బి. గోపాలరాజు, టి.ఎస్. ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.